# పోలికలు

— వసుంధర




నాన్నగారి దగ్గర్నుంచి నేను పుణికి పుచ్చుకున్న పోలిక ఒకటుంది. అది భార్యను సాధించి వేధించడం.

నాన్నగారు అమ్మను దేనికీ మెచ్చుకునేవారుకారు. ఎంత మంచి పని చేసినా ఏదో వంక పెట్టేవారు. ముఖ్యంగా అమ్మను మగాళ్ళ మధ్యకు రానిచ్చేవారు కారు. అమ్మ ఎక్కువగా వంటింట్లోనే మసలుతూండేది. ఆయన అమ్మతో కలిసి సినిమాలు చూసేవారుకాదు. వెడితే అమ్మా, నేనూ వెళ్ళేవాళ్ళం.

నేను నాతల్లిదండ్రులకు ఒక్క-గానొక్క బిడ్డని. వాళ్ళకు పెళ్ళైన ఆరేళ్ళకు పుట్టానుటనేను. నన్ను ఇద్దరూ అభిమానంగా చూసుకునేవారు. అందువల్ల నాకా ఇద్దరన్నా సమమైన ప్రేమే ఉండేది. అయితే అమ్మను నాన్నగారు తిడితే సహించలేక పోయేవాణ్ణి. అమ్మ దగ్గర నాన్నను తిట్టేవాణ్ణి.

అందుకు అమ్మ ఏ మాత్రమూ సంతోషించకుండా నన్నే తిట్టేది. మగవాళ్ళలాగే ఉంటారుట. కష్టపడి మగవాడు డబ్బు సంపాదిస్తూంటే, ఆడది కూర్చుని తింటుందిట. అందువల్ల వాళ్ళేమన్నా పడాలిట. మాట కరుకుగా ఉన్నా నాన్న గారి మనసు మంచిదిట.

ఈవిధంగా అమ్మ చెబుతూంటే అది అమ్మ గొప్పతనమని గ్రహించకుండా మగవాడు మసల వలపిన పద్ధతి అదేనన్న భావం క్రమంగా



నాలో పాతుకుపోయింది.

నాన్నగారు అప్పుడప్పుడు రఘునాధరావు అన్న పేరు తీసుకొచ్చి అమ్మను ఏవేవో అంటూండేవారు. అప్పుడు అమ్మ గుడ్లనీరు కుక్కుకుని- "అంతంత మాటలనకండీ" అనేది. ఆయన అనే అన్ని మాటలకూ పడి ఊరుకునే అమ్మ ఈ ఒక్క మాటకు ఎందుకంత బాధపడేదో నాకు అర్థమయ్యేది కాదు.

"రఘునాధరావు ఎవరే?" అని అడిగాను అమ్మనొకసారి.

రఘునాధరావు అమ్మకు బావౌతాడు. మనిషి మంచివాడు. చాలా బాగుంటాడు. అమ్మంటే చాలా ఇష్టపడతాడు. కానీ నాన్నగారిలా డబ్బున్నవాడు కాదు. అందుకని అమ్మ అమ్మా నాన్నలు అమ్మను రఘునాధరావుకు బదులు నాన్నకిచ్చి పెళ్ళి చేశారు.

"మరి నాన్న ఆయన పేరు చెప్పి ఏదో అంటే నువ్వేడుస్తావెందుకూ?" అని నేనంటే అమ్మ కంగారు పడిపోయా- "ఇవి పెద్దాళ్ళ విషయాలు నువ్వు వినకూడదు. వీటి గురించి ఆలోచించకూడదు" అని చెప్పింది.

ఆ తర్వాత నాన్నగారితో- "మీరు బావ గురించి అబ్బాయి యెదురుగుండా మాట్లాడొద్దు అడగకూడని ప్రశ్నలు అడుగుతున్నాడు వాడు" అంది.

నాన్న ఆ విషయాన్ని పట్టించుకోలేదు. నేను మాత్రం అమ్మను మళ్ళీ ఆ విషయమై అడగలేదు. కాస్త పెద్దయ్యాక మాత్రం విషయం అర్థమైంది. అమ్మమనసులో ఆ రఘునాధరావింకా ఉన్నాడేమోనని ఆయన అనుమానం.

నాకు పెళ్ళి కుదిరాక ఒకరోజు నాన్నగారు నాకు భార్యతో ఎలా మసలు కోవాలో ప్రత్యేకంగా చెప్పారు- "వయసు చిత్రమైనది. ఆడవాళ్ళకు లోబడేలా చేస్తుంది. భార్యకు లోబడి ఉండడం చాలా అవమానకరమైన విషయం. భార్యను సాటి మనిషిలా, జీవిత భాగస్వామిలా చూడ కూడదు. ఆఫీసు గుమస్తాను చూపినట్లు చూడాలి. అప్పుడే ఆడది మగవాడికి లొంగి ఉంటుంది తనను లొంగదీసుకున్న మగవాడినే ఆడది ఆరాధిస్తుంది అలా ఆడది మగవాణ్ణి ఆరాధించినప్పుడే వారికి కలిగే సంతానానికి ప్యూరిటీ ఉంటుంది. అదే పెళ్ళి పరమావధి."

నాలో నాన్నగారి పోలికలు

చాలా ఉన్నాయి. నా ముక్కూ, కళ్ళూ, ముఖం తీరూ-అన్నీ నాన్న నాన్నగారివే; అందుకాయన ఎంత గానో గర్వపడుతూంటారు. తన భార్య తనను మనసారా ఆరాధించ డంవల్లనే నాకా పోలి లొచ్చా యని ఆయన అభిప్రాయం వేనూ నా భార్యపట్ల తనకు లాగానే ప్రవ రించి తన లక్షణాలు తర తరాలుగా నిలిచి పోయేలా చేయా లని ఆయన ఆశ

చిన్నతనంనుంచీ నేను నాన్న గారు అమ్మనెలా చూస్తారో చూస్తూనేఉన్నాను. అమ్మకవన్నీ ఇష్టమేనని గ్రహించాను సహ జంగా నా ప్రవర్తన ఈ అను భవాన్ని పురస్కరించుకునే ఉంటుంది. అందుకని నాభార్యపట్ల నాప్రవర్తన ఎలా ఉండాలో కొన్ని అభిప్రాయాలేర్పడి పోయాయి

నా భార్య రమ చాలాఅందంగా ఉంటుంది అందుకని ఆమెకు చాలా అహంకారం ముందవచ్చు. ముందా అహాన్ని పోగొట్టాలి. కాబట్టి ఆమెకు నాకు వచ్చిన ఇతర సంబంధాల గురించి చెప్పాను. అందరూ అప్సరసలే కానీ కొన్ని కారణాలవల్ల వాళ్ళను నిరాకరిం చాల్సి వచ్చింది. అంటికి సుమా రుగా ఉండే రమను చేసుకున్నాను

అసలు రమను కురూపి అందా మనుకున్నాను కానీ మనసొప్ప లేదు సుమారైన అందమంటే - అదే పెద్ద అబద్ధం.

రమ బాగా చదువుకుంది. అయినా నా మాటలకు చిన్నబుచ్చు కుంది. ఆమెఉండే ఇంటికెదురుగా ఓ నవ దంపతులుండే వారట. భార్య అంత బాగుండదట భర్త సినిమా హీరోలా ఉంటాడట. కానీ వారిది అన్యోన్య దాంపత్యం. అతని పేరు వెంకటేశ్ వెంకటేశ్ భార్య అందాన్ని రోజూ పొగు డుతూ ఉంటాడట ఆ విషయం ఆమె రమకు చెప్పి సంబర పడే దిట - "నాకు పెద్ద అందం లేదు. కానీ నా భర్త నా అందాన్ని పొగి డితే నా దోదృష్టి అని అబద్ధ మని తెలిసినదే వివాహమైనాక భార్యాభర్తలు ఒకరినొకరిలా మోసం చేసుకోవడంలో విచిత్ర మైన ప్రేమాభిమానాలుంటాయి."

రమ చెప్పిన ఈ విషయంవిని నేను తడబడలేదు "ఆ వెంకటేశ్ భార్యకు అబద్ధం చెప్పి ఉండడు. వాడి పెళ్ళాం వాడి కళ్ళకు నిజం గానే అందంగా కన్పించి ఉం టుంది. అందరు మగవాళ్ళకూ నాకులా అందాన్ని గుర్తించే శక్తి ఉండదు. లేదా వాడి భార్య నిజం

గానే అందంగా ఉండి ఉంటుంది. ఇంకా పెళ్ళికాని మూలాన నీకు అప్పట్లో ప్రతి మగవాడూ సినిమా హీరోలా కనబడి ఉంటాడు" అన్నాను.

ఈ మాటలకు నా భార్య చాలా నొచ్చుకుంది.

ఈ విధంగా ఆమెను ప్రతి విషయంలోనూ దెబ్బ తీస్తూండేవాణ్ణి. నన్ను నేను పొగుడుకుంటూ ఎదుటి వాళ్ళను హీనపరుస్తూ నా భార్య నన్నారాధించేలా చేయడానికి ప్రయత్నించే వాణ్ణి.

ఆమెను మగవాళ్ళ మధ్యకు రానిచ్చే వాణ్ణి కాను తను సరదా పడినా-"అలాంటి సరదాలుండడం సంసార స్త్రీల లక్షణం కాదు" అనేవాణ్ణి. దానికి జవాబు ఆమె దగ్గరుండేది కాదు.

ఆమెలో సంసార స్త్రీల లక్షణాలు చాలా తక్కువని చెప్పాను. నా దగ్గరకువచ్చిన రెండేళ్ళలో నా కారణంగా అవన్నీ ఏర్పడ్డాయని ఆమెకు నచ్చచెప్పగలిగాను. ఇది వరకు ఆమెను చూసి బుగ్గలు నొక్కుకున్న ఆడవాళ్ళు- ఇప్పుడామెను మెచ్చుకుంటున్నారనినమ్మించాను. ఇలా ఎన్నో చేశాను.

అప్పుడప్పుడు నా భార్య వెంకటేశ్ ప్రసక్తి తీసుకొచ్చేది. నేను వాణ్ణి విరసించడమేకాక ఆమెనూ వెంకటేశ్‌ను కలిపి సూచన ప్రాయంగా అనుమానించాను. దాంతో ఆమె బెదిరిపోయింది. నా అనుమానాలు చెదరగొట్టడానికి రమ ఆ వెంకటేశ్‌ని తిట్టిపోసేది.

రమ నా కౌగిలిలో ఉన్నప్పుడు, "ఇప్పుడు నా స్థానంలో వెంకటేశ్ ఉంటే బాగుండునని ఉందికదూ నీకు?" అన్నాను ఒకసారి.

ఆమె ఉలిక్కిపడి - "అలాంటి మాటలనకండి! వాడంటే నాకు అసహ్యం" అంది.

అమ్మ రఘునాధరావు గురించి నాన్న దగ్గర కూడా ఇలాగే విసుక్కునేది. నేను పూర్తిగా నాన్న పోలికలతో పుట్టాను. ఇప్పుడు వెంకటేశ్ గురించి రమ కూడా అదే స్థాయికి వచ్చింది. నాకు పుట్టబోయే బిడ్డ నా వంశ లక్షణాలను పూర్తిగా సంతరించుకుంటుంది.

నాకు రమమీద ఏ మాత్రమూ అనుమానం లేదు. అయినప్పటికీ అలాఅనుమానించడంనాకుసరదా. ఆడదానికి అఫెన్సుకు ఛాన్సివ్వకూడదు. ఎప్పుడూ డిఫెన్సులోనే ఉంచాలి. ఇది నాన్నగారి దగ్గర నేర్చుకుని నేను అమలు చేస్తున్న ముఖ్య విశేషం.

రమ గర్భవతి అయింది

ఒక్కగానొక్క కోడలు. అన్ని ముచ్చట్లూ వైభవంగా జరిగాయి.

రమ పండంటి కొడుకును కన్నది. వాడివి అన్నీ తల్లి పోలికలు. నా పోలికలు రానందుకు బాధపడ్డాను. తల్లి పోలికవస్తే కొడుక్కి అదృష్టమంటారు. తండ్రి పోలిక వచ్చిన నాకుమాత్రం అదృష్టానికి తక్కువేముంది?

అబ్బాయికి నాన్నగారి పేరే పెట్టాం. వాడికి మాటలు వచ్చే సరికి నాకెంతో ఆనందం కలిగించే విశేషం జరిగింది.

నన్నెవరైనా పేరడిగితే ఒక సారి ముక్కు తమాషాగా నలుపుకుని అప్పుడు పేరు చెబుతాను. ఇది చాలా విచిత్రమైన అలవాటు. చూసే వాళ్ళను ప్రత్యేకంగా ఆకర్షిస్తుంది. మా అబ్బాయి కూడా పేరడిగితే సరిగ్గా అలాగే చేస్తున్నాడు. ఇది వాడు నన్ను చూసి నేర్చుకున్న అలవాటుకాదు. తనకు తానే వచ్చిన అలవాటు. అంటే వాడికి నా ప్రత్యేకమైన పోలిక వచ్చిందన్నమాట!

వాణ్ణి రోజూకు పదిసార్లైనా పేరడిగి వాడి ఈ చేష్ట చూసి సంతోషించే వాణ్ణి. నేనే కాదు- అమ్మ, రమ, నాన్నగారు అంతా అలాగే చేసేవారు.

నాన్నగారి పోలికలు పుణికి పుచ్చుకున్న నాకు కలిగిన కొడుకు నా పోలికలు పుణికి పుచ్చుకుంటున్నాడు కనీసం ఇంకో తరంపాటు మా వంశలక్షణాలు నిలబడతాయి.

అబ్బాయికి నాలుగో ఏడు వచ్చే సరికి రమ మళ్ళీ గర్భవతయింది. ఆమెను అత్తవారింట దిగ విడిచి రావడానికి కూడా వెడుతున్నాను. ఈ పర్యాయం పుట్టేబిడ్డకూడా నా పోలికలే రావాలని నా ఆశ.

రైల్లో మాకు ఎదురు సీట్లలో వృద్ధ దంపతులు కూర్చున్నారు. వాళ్ళిద్దరూ ఎంతో అన్యోన్యంగా సినిమా జంటలా మసల్తున్నారు. భర్త భార్యకోసం చాలా ఖంగారు పడుతున్నాడు.ఆమె కేవేంకావాలో అడుగుతున్నాడు. తనక్కావాల్సిన వస్తువులు తెచ్చిపెట్టడానికి ఆయన ట్రయిన్ దిగడం ఆవిడకిష్టంలేదు. చాలానెమ్మదిగా-"మీరు నాపక్కన కూర్చుంటే చాలు! నా కింకేమీ అక్కర్లేదు కిటికీ దగ్గర కేం వస్తే అవే కొనుక్కుందాం" అంది. ఆయన వినలేదు. "మనక్కావలసినవన్నీ కిటికీ దగ్గరకు రావు" అంటూ ఆయన ప్లాట్ఫారంమీదకు

దిగి ఏవో పళ్ళు కొనుక్కువచ్చి - "ఇవి చాలా మంచివి. కిటికీ దగ్గరకు చెత్తపరుకు పస్తోంది" అన్నాడు.

మధ్యలో వాళ్ళు మమ్మల్ని కూడా పలకరించారు. ఆయన తన భార్య గురించి చాలా జోకులు వేశాడు. ఆవిడ సిగ్గు పడుతూనే ఆయన గురించి తనూ కొన్ని చెప్పింది.

నేనెప్పుడూ అటువంటి జంటని చూడలేదు. నా భార్య నెమ్మదిగా నా చెవిలో-"వాళ్ళు వృద్ధ దంపతుల్లా లేరు కొత్తగా పెళ్ళయిన వాళ్ళలా ఉన్నారు" అంది.

ఆ మాట ఆ ముసలాయనకు వినబడ్డటుంది - "కొత్తగా పెళ్ళి కావడమేంటమ్మా! మాకింకా పెళ్ళికాలేదు. ఇంకా ఏడాది ఆగాలిట" అన్నాడు.

నేనా మాటలు విని ఆశ్చర్య పోతూంటే-"వచ్చే ఏడాది ఆయనకు షష్టి పూర్తిలెండి" అందావిడ.

నేను, రమ నవ్వకుండా ఉండలేకపోయాం. అప్రయత్నంగా నా మనసులో 'అమ్మ, నాన్న - అలా ఉంటే?' అనిపించింది. 'అమ్మ ఈ ముసలాయన్ని చూస్తే తన భర్త అలా ఉండనందుకు విచారించదా?' అన్న అనుమానం కలిగింది. 'అమ్మ సంగతి సరే-పడుచుతనంలో ఉన్న రమ సంగతేమిటి?'

దాని గురించి అట్టే ఆలోచించదల్చుకోలేదు. ఒకో మగవాడికి ఒకో ప్రత్యేకత ఉంటుంది. వృద్ధాప్యంలో ఇటువంటి పబ్లిక్ శృంగారం జుగుప్సాకరంగా కూడా ఉంటుంది. అమ్మ దీన్ని అనుకూలించదు నేను, నాన్నగారు అనుసరిస్తున్న విధానమే సరైనది. పెద్ద మనిషి తరహాగా ఉంటుంది.

ఆడవాళ్ళకు సిగ్గెక్కువంటారు! ఆ ముసలావిడ సిగ్గుపడుతోంది కానీ, ఆవిడ కళ్ళలో భర్తపట్ల ఆరాధనాభావం కనబడుతోంది. అటువంటి భావాన్ని నేనెప్పుడూ నా భార్య కళ్ళలో చూడలేదు. రమ కళ్ళలో ఎక్కువ బెదురు, సంకోచం కనబడుతూంటాయి.

కాసేపు సంభాషణలు నడిచాక, ఆయన పరిచయం చేసుకుందామని పేరడిగాను.

ఆయన తమాషాగా ముక్కు నలుపుకుని - "నా పేరు రఘునాధరావు" అన్నాడు. •

Edited & Published by Vijayabapineedu 80, Dhanalaxmi Colony, Madras 600 026, Printed by him at Vijaya Graphics; 210, Arcot Road, Madras-600 026. Phone: 422233